నెరవేరని కల..



- ఏటా 'పది' చదువుతున్న విద్యార్థులు 450 మందిపైనే
- ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ అభ్యసన
- వ్యయప్రయాసల వల్ల టెన్త్‌తో చదువుకు స్వస్తి చెబుతున్న బాలికలు
- 72 ఏళ్లుగా జూనియర్ కళాశాలకు నోచుకోని మునగపాక

మునగపాక: ప్రభుత్వాలు మారుతున్నా మునగపాక విద్యార్థుల కల నెరవేరడం లేదు. 72 ఏళ్లుగా ఇంటర్ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా చెవికెక్కడం లేదు. పర్యవసానంగా సదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ బాధలు పడలేక కొంతమంది విద్యార్థినులు టెన్త్‌తో చదువుకు స్వస్తి చెబుతున్నారు. మండల వ్యాప్తంగా ఏటా 450 మందికి తగ్గకుండా పదో తరగతి పాసవుతున్న విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు వ్యయప్రయాసలు పడుతున్నారు.

1952లోనే మునగపాక హైస్కూల్ ఏర్పాటు...

మునగపాకలో ఇంతవరకు జూనియర్ కళాశాల అందుబాటులో లేకుండా పోయింది. 1952లో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు 72 సంవత్సరాలు కావస్తున్నా ఇంటర్ చదువుకునేందుకు అవస్థలు తప్పడం లేదు. స్థానికంగా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో ప్రజా ప్రతినిధులు అంతగా ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో జూనియర్ కళాశాల చదువులు ఇబ్బందికరంగా మారుతున్నాయి.

8 హైస్కూళ్లు... 483 మంది 'పది' విద్యార్థులు...

మండల వ్యాప్తంగా ఆరు జిల్లా పరిషత్ హైస్కూళ్లతో పాటు పాటిపల్లి మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఉన్నాయి. ప్రస్తుతం మునగపాక హైస్కూల్‌లో 78 మంది విద్యార్థులు, తోటాడ హైస్కూల్‌లో 98, నాగులాపల్లిలో 65, వాడ్రాపల్లిలో 31 మంది, తిమ్మరాజుపేటలో 26 మంది, గణపర్తిలో 66 మంది, పాటిపల్లి కేజీబీవీలో 31 మంది బాలికలు, మోడల్ స్కూల్‌లో 88 మంది విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. ఏటా 450 మందికి తక్కువ కాకుండా పది పరీక్షలు రాస్తున్నారు. మండల వ్యాప్తంగా 206 మంది బాలురు, 277 మంది బాలికలు ప్రస్తుతం పదో తరగతి చదువుకుంటున్నారు. వారంతా ఇంటర్ చదువుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కోకతప్పదు.

వ్యయ ప్రయాసలతో ఇంటర్ చదువులు...

స్థానికంగా ఇంటర్ చదువుకునేందుకు జూనియర్ కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో వ్యయ ప్రయాసలతో యలమంచిలి, అనకాపల్లి వంటి ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. ఆటోలు, బస్సులపై ఇబ్బందులు పడుతూ చదువుకోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. బాలికలను సుదూర ప్రాంతాలకు పంపి ఇంటర్ చదివించేందుకు వారి తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లే బాలిక తిరిగి ఎప్పుడు వస్తుందోనని వేయి కళ్లతో ఎదురు చూడాల్సిన రోజులు కావడంతో పదితోనే పలువురు బాలికలు సరిపెట్టుకుంటున్నారు. చదువుపై మక్కువ ఉన్నా స్థానికంగా కళాశాల చదువులు లేకపోవడంతో అర్ధాంతరంగా స్వస్తి పలుకుతున్నారు.



సుదూర ప్రాంతాలకు వెళ్లాలి

మునగపాకలో ఇంటర్ చదువుకునేందుకు అవసరమయ్యే జూనియర్ కళాశాల మంజూరుపై పాలకులు దృష్టి సారించాలి. బాలికలు ఉన్నత చదువులు చదువుకునేందుకు స్థానికంగా కళాశాల లేకపోవడంతో కొంతమంది పదో తరగతితో మానేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదివించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

– ఆదారి మౌనిక అన్నపూర్ణ, పదో తరగతి విద్యార్థిని



కళాశాల మంజూరు చేయాలి

మునగపాక హైస్కూల్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులున్నా, ఇంతవరకు కళాశాల ఏర్పాటు చేయలేదు. పదో తరగతి తర్వాత ఇంటర్ చదువులకు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు దృష్టి సారించి ఇంటర్ కళాశాల మంజూరయ్యేలా చూడాలి.

– ఆదారి సూర్యచంద్రరావు, పీఏంసీ చైర్మన్, మునగపాక



వినతులు వస్తే నివేదిస్తాం

మునగపాకలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి ఇంతవరకు తల్లిదండ్రుల నుంచి ఎటువంటి వినతులు అందలేదు. ఇక్కడ జూనియర్ కళాశాల ఆవశ్యకత అయితే ఉందనే చెప్పాలి. ఏటా 450 మందికి తక్కువ కాకుండా పది చదువుకుంటున్నారు. తల్లిదండ్రుల నుంచి వినతులు వస్తే వాటిని ఉన్నతాధికారులకు అందజేస్తాం.

–వేణుగోపాలరావు, ఎంఈవో, మునగపాక

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముత్యాలనాయుడు

ఎస్.రాయవరం: సీనియర్ నాయకుడు బొలిశెట్టి అప్పారావు మృతి పార్టీకి తీరని లోటని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తండ్రి అప్పారావు ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఎస్.రాయవరంలో గోవిందరావును ముత్యాలనాయుడు సోమవారం పరామర్శించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్‌లు శానావతి శ్రీరాములు, కొప్పిశెట్టి సత్యం, జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ సూరకాసుల గోవిందు, నాయకులు అన్నందేవర బాబ్జి, పెకులరాజు పాల్గొన్నారు.

నేడు మడుతూరు నూకాంబిక పండగ

అచ్యుతాపురం: మండలంలోని మడుతూరు నూకాంబిక అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏటా ఘనంగా నిర్వహించే ఈ పండగ నేపథ్యంలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ మేరకు గ్రామంలో నాటికను ప్రదర్శించనున్నారు.

ముగిసిన ప్రాణ ప్రతిష్ఠోత్సవాలు

అచ్యుతాపురం: మండలంలోని చీమలాపల్లిలో అన్నపూర్ణ దేవి సమేత స్వయంభూ కాశీ విశ్వేశ్వరస్వామి మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. మూడో రోజు కార్యక్రమంలో భాగంగా స్వామివారి ప్రాణ ప్రతిష్ఠ, కల్యాణం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు.

మందుబాబులపై కేసులు

అనకాపలి టౌన్: బహిరంగ ప్రదేశాలో మద్యం సేవిస్తున్న వ్యక్తులపై పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. అనకాపల్లి స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి దాబాలు, బహిరంగ ప్రదేశాలలో దాడులు నిర్వహించి, మద్యం సేవిస్తున్న 25 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఈ దాడులలో ట్రైనీ డీఎస్పీ ఎం.వి. కృష్ణచైతన్య, టౌన్ ఎస్ఐ డి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

20న జీడి మామిడి ఫలసాయానికి వేలం

నక్కపల్లి: మండలంలోని లింగాలతిరుగుడులో వేంచేసిన సోమలింగేశ్వస్వామివారి దేవస్థానానికి చెందిన జీడి మామిడి తోట ఫలసాయం అనుభవించుటకు టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బి.మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.79లో 3.50 ఎకరాల విస్తీర్ణంలోని జీడి మామిడి తోట ఫలసాయం ఏడాదికి గాను, సర్వే నెం.70/7, 70/11లలోని 3.60 ఎకరాల జీడి మామిడి తోట మూడేళ్ల కాలానికి హక్కుల కోసం ఈ వేలం పాట జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ బహిరంగ వేలాన్ని దేవస్థానం వద్ద ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు.

టొరెంటో ప్రమాదంపై ఆర్డీవోకు వినతి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సిటు నాయకులు

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలోని టొరెంటో పరిశ్రమలో ఆదివారం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనకాపల్లి ఆర్డీవో సుధాకర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా పి.రామకృష్ణ, జె.బసవేశ్వరరావు అనే కాంట్రాక్టు కార్మికులు అస్వస్థతకు గురై, ఆస్పత్రి పాలయ్యారని ఆరోపించారు. కార్మికులకు మాస్కులు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి



ఎండీఎం నిర్వాహకులు, పారిశుధ్య కార్మికులు

అచ్యుతాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతోపాటు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి, సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ చార్జీల బడ్జెట్ పెంచాలన్నారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం వర్తింపజేసి, ప్రతి నెల సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి సెలవులు మంజూరు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత, పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ సౌకర్యంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు సత్యవతి, రాము, వరలక్ష్మి, రమణమ్మ, అప్పల నరసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

ఎస్.రాయవరం: మండలంలో ప్రధాన సమస్యగా మారిన అడ్డురోడ్డు – నర్సీపట్నం రోడ్డు మరమ్మతులు, విస్తరణ పనులు సోమవారం ప్రారంభించినట్టు ఆర్అండ్‌బీ ఏఈ జ్ఞానేశ్వరరావు తెలిపారు. పలుమార్లు మొదలుపెట్టి నిలిపేసిన పనులపై 'హోం భీమ్ బుష్'.. అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. మరో నెల రోజులు తర్వాత పూర్తిస్థాయి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రెండు నెలల వ్యవధిలో పనులు పూర్తి చేస్తామన్నారు. సమస్యాత్మకంగా ఉన్న రోడ్డు పునులు ప్రారంభించడం పట్ల వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏఈ జ్ఞానేశ్వరరావు

ప్రభుత్వ భూముల ఆక్రమణపై నిరసన

పోలీసు, రెవెన్యూ అధికారులకు మత్స్యకారుల ఫిర్యాదులు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మత్స్యకారులు



తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు పత్రం అందజేస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం/రూరల్: ప్రభుత్వ భూముల ఆక్రమణపై పూడిమడకకు చెందిన నాలుగు గ్రామాల మత్స్యకారులు సోమవారం స్థానిక తహసీల్దార్‌కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. పూడిమడక రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 82, 83లో సుమారు 90 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది దళారులు ఆక్రమించి సరుగుడు, జీడి తోటలను నరికి ట్రాక్టరుతో దున్నించారు. విషయాన్ని తెలుసుకున్న మత్స్యకారులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. భూముల రేట్లు ఒక్కసారిగా ఆకాశాన్నంటడంతో కబ్జా రాయుళ్లు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఆ భూముల్లో సాగు చేసుకుంటూ దానిపై వచ్చిన ఫలసాయంతో కొంత గ్రామ దేవతల పండగలకు వెచ్చిస్తున్నామన్నారు. మిగిలిన దాంతో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఫిర్యాదుల్లో కోరారు.

ఘనంగా అడవిరాజుల పండగ



సుంకపూరులో అడవిరాజుల ఆలయం వద్ద భక్తులు



లింగాపురంలో గుమ్మడికాయకు వేలాడదీసిన బండిచక్రం

కోటవురట్ల: సుంకపూరులో అడవిరాజుల పండగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. పాడిపంటలో అంతా సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు పర్యవేక్షించారు. లింగాపురంలో ఆదివారం రాత్రి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గుమ్మడికాయకు కత్తి దూర్చి వేలాడదీసిన బండిచక్రం, సొరకాయకు కత్తి గుచ్చి వేలాడదీసిన బిందెడు నీళ్లు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి భక్తులు సారె తీసుకెళ్లి సమర్పించారు.

కొత్తపేట శివాలయంలో పునః ప్రతిష్ట క్రతువు



క్రతువు ప్రారంభించిన వేదపండితులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట పురాతన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ట క్రతువు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో స్థానికుల సహకారంతో పునర్నిర్మాణం చేశారు. పనులు దాదాపుగా పూర్తి కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేద మంత్రోచ్ఛరణల మధ్య క్రతువు నిర్వహించారు. ఈ క్రతువులో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, వేద పాఠశాల నిర్వాహకుడు పెద్దింటి సూర్యనారాయణమూర్తి, బీఎస్ బంగారుశెట్టి, చంద్రమౌళి సోమేశ్వరరావు, సుందరపు బాబ్జీ, పిల్లా త్రినాథరావు, సీతాజీ, లంకరాజు, చందక అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం: మండలంలోని వెదురువాడ ఫీడర్ పరిధిలో కొత్త లైన్ పనులతో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ(ఆపరేషన్స్) రాజశేఖర్ తెలిపారు. వెదురువాడ, జి. ధర్మవరం, ఎల్. ధర్మవరం, ఎం.ధర్మవరం, మోసయ్యపేట బర్మా కాలనీ, అచ్యుతాపురం ఇందిరమ్మ కాలనీ, ఆర్అండ్ఆర్ కాలనీ, దిబ్బపాలెం, వెంకటాపురం సెంటర్, మార్టూరు రోడ్, సాయి ప్రియ లేఅవుట్, అచ్యుతాపురం సెంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవోలు రామారావు, శ్రీజోష్

మునగపాక: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వేణుగోపాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని 57 మంది అంగన్‌వాడీ టీచర్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ టీచర్లు హాజరు కావాలన్నారు.

జ్ఞానజ్యోతిపై ఆరు రోజుల శిక్షణ

కోటవురట్ల: జ్ఞానజ్యోతి కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. శిక్షణ ఈ నెల 24వ తేదీ వరకు ఉంటుందన్నారు. శిక్షణకు వచ్చేవారికి భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు.

చెరువుల ఆక్రమణపై ఫిర్యాదు

కశింకోట: మండలంలోని గొబ్బూరు గ్రామ పరిధిలోని రెండు చెరువుల్లో ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రైతు బుద్ధ వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. గొబ్బూరు గ్రామం వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా గైరమ్మ, కారిపాలం చెరువులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. గైరమ్మ చెరువును ఆక్రమించి రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారు సర్వీసు రోడ్డు నిర్మిస్తుండగా, కారి పాలం చెరువును రియల్టర్లు, ఇతరులు దాదాపు సగం మేర ఆక్రమించి చదును చేశారన్నారు. దీంతో ఇవి కుచించుకుపోయాయన్నారు. వీటికి వచ్చే సాగునీటి కాలువలను కొంత మేర పూడ్చి వేశారన్నారు. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందక నష్టపోతున్నామని వాపోయారు. ఈ విషయమై పరిశీలన చేసి చెరువుల్లో ఆక్రమణలు తొలగించి ఆయకట్టుకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు



బోర్డును ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి జ్ఞానకేశ్వరబాబు

అనకాపల్లి: మండలంలోని మారేడుపూడి గ్రామంలో సర్వే నంబర్ 389/12 నుంచి 18 వరకు గల ప్రభుత్వ స్థలంలో పంచాయతీ కార్యదర్శి జ్ఞానకేశ్వరబాబు సోమవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇక్కడ స్థలంలో కొంత మంది కూటమి నాయకులు లేఅవుట్లు వేసి అమ్మకాలు సాగించేందుకు చర్యలు చేపట్టారు. దాంతో జనవరి 7న గ్రామస్తులు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు పెట్టారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఆయన హెచ్చరిక బోర్డులు పెట్టారు. ప్రభుత్వ స్థలంలో లేఅవుట్లు వేసి అమ్మకాలు, కొనుగోలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఆక్రమించినట్లయితే ఆయా ప్రాంతాల ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



షేక్ సతార్ బీబీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్‌ను మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు సోమవారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన ఇస్మాయిల్ భార్య సతార్ బీబీ సంతాప సభ కార్యక్రమం ఇక్కడ నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన పీస్ మెసేజ్ ఫౌండేషన్ ఫౌండర్ సిరాజ్ రెహమాన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అనంతరం సిరాజ్‌ను రమణమూర్తిరాజు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆదారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, దళిత విభాగం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, మండల అధ్యక్షుడు మందా రాము, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, సర్పంచ్‌లు మద్దాల నాగప్పారావు, సుందరపు తాతాజీ, పార్టీ నేతలు బొద్దేడ చెల్లయ్యనాయుడు, సాయి వజ్రం, బొద్దేడ లిల్లి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం అంగన్‌వాడీల ఆందోళన



నక్కపల్లి సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నక్కపల్లి: తమకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, తదితర సమస్యలు నెరవేర్చాలంటూ సోమవారం నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ సిబ్బంది ఎన్నో సేవలందిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు రకరకాల పెట్టుబడులు పెట్టినప్పటికీ వేతనాలు పెంచడం లేదని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు చారిత్రాత్మకమైన సమ్మె చేశామన్నారు. 2024 జూలైలో తమ వేతనాలు పెంచుతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని, అన్ని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ వెంటనే జీవో విడుదల చేయాలని అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు దుర్గారాణి, వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. హెల్పర్లకు ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ విడుదల చేయాలన్నారు. సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ సిబ్బందికి అమలు చేయాలని, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కారాల నిమిత్తం ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రాల అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. అన్ని యాప్‌లను ఒకే యాప్ కింద రూపొందించాలన్నారు. మెనూ చార్జీలు పెంచడంతోపాటు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలన్నారు. ప్రీస్కూలు బలోపేతం చేసేందుకు తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలంతా అంగన్‌వాడీల్లో ఉండేలా జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవో శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు.

లారీ నుంచి పడిన బండరాళ్లు

బండరాళ్ల లారీలను ఆపి వెంకటాపురం గ్రామస్తుల ఆందోళన



ప్రమాదకరంగా బండరాళ్ల లారీ



వెంకటాపురంలో బండరాళ్ల లారీలను అడ్డుకొని ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి నేవల్ బేస్ ప్రాజెక్టు నిర్మాణానికి లారీ నుంచి తరలిస్తున్న బండరాళ్లు సోమవారం రాత్రి వెంకటాపురంలో రోడ్డుపై పడ్డాయి. నిత్యం జనసంచారం ఉన్న ప్రాంతంలో బండరాళ్లు పడటంతో గ్రామస్తులు బండరాళ్ల లారీలను కిలోమీటరు మేర ఆపి ఆందోళన చేపట్టారు. వీటి వేగానికి గ్రామంలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని, లారీలపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వచ్చి గ్రామస్తులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బండరాళ్ల లారీలను తరలిస్తున్న డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తామని, అధిక బరువుతో తరలించే లారీలపై చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నేవల్ బేస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అధిక బరువుతో పరిమితికి మించిన లారీలు వెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎవరికీ ఏ ప్రమాదం జరిగినా అధికారులు బాధ్యత వహించాలని గ్రామస్తులు తేల్చిచెప్పారు. బండరాళ్ల లారీలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.